సాక్షి
అనంతపురం
శుక్రవారం । 29 । మార్చి । 2024



టన్ను చీనీ రూ.25,500

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.25,500 పలికాయి.



కిలో టమాట రూ.13

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.13 పలికింది. మార్కెట్‌కు 150 టన్నుల సరుకు అమ్మకానికి వచ్చింది.

రంజాన్ వేళలు

శుక్రవారం	శనివారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.33	సెహరీ : 5.00



కాలవ మోసం.. ఇదే సాక్ష్యం

గత ఎన్నికల ముందు కాలవ శ్రీనివాసులు కనికట్టు

- కల్యాణ మండపాల నిర్మాణమంటూ హడావుడి శంకుస్థాపనలు
- శిలాఫలకాలతో వల పన్నిన వైనం
- ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో నేడు ఆయా వర్గాలకు మళ్లీ ఎర
- తనకు అవకాశమిస్తే పూర్తి చేస్తానంటూ మాయ మాటలు
- మళ్లీ మోసపోలేమంటున్న ప్రజలు



ఇది రాయదుర్గం పట్టణంలోని బళ్లారి రోడ్డులో నాయీ బ్రాహ్మణ భవన నిర్మాణం కోసమంటూ టీడీపీ హయాంలో వేసిన శిలాఫలకం. సరిగ్గా గత సార్వత్రిక ఎన్నికలు రెండు నెలల్లో జరగబోతున్నాయగా.. అప్పట్లో మంత్రిగా ఉన్న కాలవ శ్రీనివాసులు హడావుడిగా శిలాఫలకం వేసేశారు. అధికారంలో ఉన్న ఐదేళ్లు పట్టించుకోకుండా కేవలం ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కనికట్టు చేసేశారు. ఇదొక్కటే కాదు... పలు వర్గాలను మచ్చిక చేసుకునేందుకు పట్టణంలో అనేక చోట్ల ఇలాగే శిలాఫలకాలతో నాటకాలకు తెరలేపి వలపన్నారు. కానీ, అప్పటికే ఆయన మోసాలతో విసిగిపోయిన ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారు.

రాయదుర్గం: తనను నమ్మి ఓట్లేసిన పాపానికి నియోజకవర్గ ప్రజలను గతంలో కాలవ శ్రీనివాసులు నిండా ముంచారు. టీడీపీ హయాంలో మంత్రిగా పని చేసినా నియోజకవర్గానికి ఆయన ఒరగ బెట్టిందేమీ లేదు. పైగా టీడీపీ నేతలతో కలిసి దోపిడీలకు తెగ బడ్డారు. కావాల్సినంత వెనకేసుకున్నారు. అప్పట్లో ప్రజలపై పచ్చమూకలు దౌర్జన్యాలకు పాల్పడినా అడ్డు చెప్పలేదు. జన్మభూమి కమిటీలు అరాచకాలు చేస్తున్నా ఆపలేదు సరికదా.. వారికే వంత పాడారు. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత మూటకట్టుకున్నారు.

కుల సంఘాలకు కుచ్చుటోపీ..

మంత్రిగా ఉన్నన్నాళ్లు నియోజకవర్గాన్ని పట్టించుకోని కాలవ శ్రీనివాసులు.. గత సార్వత్రిక ఎన్నికల ముందు నాటకాలకు తెరలేపారు. ఎలాగైనా ఓట్లు రాబట్టేందుకు కల్యాణ మండపాల పేరుతో డ్రామాలు చేశారు. సరిగ్గా ఎన్నికలకు రెండు మూడు నెలల సమయం ఉండగా, రాయదుర్గం ముత్రాసు కాలనీ బైపాస్‌రోడ్డు పక్కన షాదీమహల్‌కు, మల్లాపురం లౌఅవుట్ వద్ద రజక భవనానికి, బళ్లారి రోడ్డులో స్వకులసాలి సమాజ కళ్యాణ మండపానికి శంకుస్థాపనలు చేశారు. ఆర్భాటంగా శిలాఫలకాలు వేశారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు కేవలం గంట ముందు కూడా డీ హీరేహాళ్ మండలం ఓబుళాపురం వద్ద గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో నీటి పథకం పనులకు శంకుస్థాపన చేశారంటే ప్రజలకు కుచ్చుటోపీ పెట్టేందుకు ఆయన ఎంతలా యత్నించారో అర్థం చేసుకోవచ్చు. కాలవ మోసాలకు నేటికీ ఆ శిలాఫలకాలు సాక్ష్యాలుగా దర్శనమిస్తున్నాయి.

మళ్లీ మోసగించేందుకు కుయుక్తులు..

ఎన్నికల సమయంలో నాటకాలు ఆడడం అలవాటుగా మార్చుకున్న కాలవ శ్రీనివాసులు.. నేడు మళ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కుయుక్తులకు తెరలేపారు. ఈ సారి గెలిపిస్తే తప్పకుండా కల్యాణ మండపాలు పూర్తి చేస్తానంటూ కొత్త రాగం అందుకున్నారు. కానీ, ఆయన మోసాలు పసిగట్టిన నియోజకవర్గ ప్రజలు నవ్వుకుంటున్నారు. అధికారం చేతిలో ఉన్నప్పుడే పూర్తి చేయలేని నిర్మాణాలను.. మళ్లీ గెలిపిస్తే పూర్తి చేస్తామని చెబుతుండడం హాస్యాస్పదమంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. 650 హామీలిచ్చి, ఆఖరుకు ఆరింటిని కూడా నెరవేర్చని టీడీపీ అధినేత చంద్రబాబు బాటలోనే కాలవ శ్రీనివాసులు ఇంకా నడుస్తుండడం బాధాకరమంటూ నిట్టూరుస్తున్నారు.

కాలవను ఎవరూ నమ్మరు



గత ఎన్నికల ముందు షాదీ మహల్ నిర్మాణానికి కాలవ శ్రీనివాసులు భూమి పూజ చేశారు. ముస్లిం, మైనార్టీలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశపడ్డాం. చివరికి అంతా ఆర్భాటమేనని తేలింది. పైసా నిధులు మంజూరు చేయకుండా మోసం చేశారు. ఇలాగే, శ్మశాన వాటికకు కూడా శిలాఫలకం వేసి చెవిలో పూలు పెట్టారు. నేడు మళ్లీ డ్రామాలాడుతున్న ఆయనను నమ్మేవారు లేరు.

– గోనబావి షర్మశ్,రాయదుర్గం

ఆశలపై నీళ్లు చల్లారు



కల్యాణ మండపం నిర్మిస్తామని చెప్పి నాయీ బ్రాహ్మణులను కాలవ శ్రీనివాసులు మోసగించారు. శాంతినగర్‌లో శిలాఫలకం వేసినప్పుడు చాలా సంతోషించాం. అంతటితోనే చేతులు దులుపుకుని మా ఆశలపై నీళ్లు చల్లారు. నిధులు మంజూరు చేయకపోవడంతో నేటికీ శిలా ఫలకం ప్రజలను వెక్కిరిస్తోంది.

– రఘురాం, రాయదుర్గం

మాయమాటలతో సరి



టీడీపీ హయాంలో స్వకులశాలి, కుర్నిశాలి, పద్మశాలి కులాల వారి కోసం కల్యాణ మండపాలు నిర్మిస్తామంటూ శిలా ఫలకాలు వేశారు. ఇవి పూర్తయ్యాక ఎంతో ఉపయోగపడతాయని అనుకున్నాం. తీరా చూస్తే అవి ఉత్తుత్తివని తేలింది. ఎన్నికల ముందు మాయ మాటలు చెప్పి వంచించడం సరికాదు.

– నగేష్, శాంతినగర్, రాయదుర్గం

రేపు జిల్లాకు సీఎం జగన్



అనంతపురం కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శనివారం జిల్లాకు రానున్నారు. 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా గుత్తికి సాయంత్రం 4 గంటలకు సీఎం చేరుకుంటారు. పామిడి, గార్లదిన్నె, రాప్తాడు, ఇటుకలపల్లి మీదుగా రోడ్ షోలో పాల్గొంటారు. అదే రోజు రాత్రి కృష్ణంరెడ్డి పల్లిలో బస చేయనున్నారు.

సీఎం పర్యటనకు తరలిరండి

గుంతకల్లుటౌన్: వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజలకు చేసిన మంచిని వివరించి, మరోసారి ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరేందుకు సీఎం వైఎస్ జగన్ చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సుయాత్ర శనివారం గుత్తి పట్టణానికి చేరనున్నట్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తెలిపారు. ప్రజలు, పార్టీశ్రేణులు, వైఎస్సార్ అభిమానులు తరలివచ్చి, వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించడానికి తామంతా సిద్ధమని చాటిచెప్పాలని పిలుపునిచ్చారు.

పలు రైళ్ల రద్దు.. దారి మళ్లింపు

గుంతకల్లు: నైరుతి రైల్వే పరిధిలో జరుగుతున్న పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేయడంతోపాటు కొన్నింటిని దారి మళ్లించినట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ తెలిపారు. ఏప్రిల్ 3 నుంచి 10 వరకూ కేఎస్ఆర్ బెంగళూరు-ధర్మవరం (06595/56) రైళ్లు రద్దు చేసినట్లు వివరించారు.ఏప్రిల్ 7,8 తేదీల్లో గౌరీబిదనూర్-ధర్మవరం మధ్య మాత్రమే రాకపోకలు సాగిస్తాయన్నారు. జైపూర్- మైసూర్ (12976) ఎక్స్‌ప్రెస్‌ను ఏప్రిల్ 1 నుంచి 8 వరకు గుంతకల్లు, బళ్లారి, రాయదుర్గం, ఆరిశికేరి, హసన్ మీదుగా మళ్లించినట్లు తెలిపారు. కలబురిగి-బెంగుళూరు (22231) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 3 నుంచి 10 వరకు 5.20 గంటలు ఆలస్యంగా నడుస్తుందన్నారు. మరో వందేభారత్ (22231) గంట ఆలస్యంగా రాకపోకలు సాగిస్తుందన్నారు.

న్యూస్‌రీల్

నృసింహుని రథోత్సవానికి ప్రత్యేక బస్సులు



కదిరి అర్బన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం ఈ నెల 30న నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా భక్తుల సౌకర్యార్థం కదిరి డిపో నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డీఎం మైనోద్దీన్ తెలిపారు. కదిరి డిపోలో ఉన్న 110 బస్సులకు అదనంగా హిందూపురం, మడకశిర, ధర్మవరం డిపోల నుంచి మరో 15 ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులు నడపనున్నట్లు పేర్కొన్నారు. కదిరి నుంచి గోరంట్ల మీదుగా హిందూపురానికి 20 బస్సులు, నల్లమాడకు 10, బెంగళూరుకు 15, పులివెందులకు 7, తలుపులకు 6 బస్సులు నడుపుతామన్నారు. ప్రయాణికులు ఎండవేడికి తట్టుకునేలా జీవిమానుకూడలి, వేమారెడ్డి సర్కిల్, బస్టాండ్, సరస్వతీ విద్యామందిరాల వద్ద ప్రత్యేక బస్సు షెల్టర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ప్రతి షెల్టర్ వద్ద ఇద్దరు పోలీసులు (ఆర్టీసీ కానిస్టేబుళ్లు), ఇద్దరు సేఫ్టీ డ్రైవింగ్ శిక్షకులు, ఇద్దరు వలంటీర్లు, సూపర్‌వైజర్‌ను నియమించినట్లు చెప్పారు. సమావేశంలో అసిస్టెంట్ డిపో మేనేజర్లు హరిత, హరి మోహన్, అసిస్టెంట్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు శుభవార్త

అనంతపురం టౌన్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త వినిపించింది. కనీస వేతనాన్ని పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకూ రూ.272గా ఉన్న కనీస వేతనాన్ని, ఏప్రిల్ ఒకటి నుంచి రూ.300కు పెంచినట్లు వెల్లడించింది. జిల్లా వ్యాప్తంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 5 లక్షలకు పైగా జాబ్ కార్డులు ఉన్నాయి. ఏప్రిల్ 1 నుంచి ఉపాధి పనులకు వెళ్లే కూలీలకు పెంచిన కనీస రోజువారీ వేతనం వర్తిస్తుందని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఉపాధి కూలీలకు ఈ విషయంపై అవగాహన కల్పించి, సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఉపాధి హామీ సిబ్బందికి ఆయన సూచించారు.

తాగునీటి సమస్య ఉంటే ఫోన్ చేయండి

అనంతపురం రూరల్: జిల్లాలో ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే సమాచారమందించాలని, వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసన్‌బాషా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందు కోసం జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. 08554-275892, 9390098329 నంబర్లకు ఫోన్ చేసి సమస్య తెలియజేయాలని కోరారు.

ఆర్ట్స్ కళాశాల డిగ్రీ సెమిస్టర్ ఫలితాల విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో గత డిసెంబర్‌లో నిర్వహించిన డిగ్రీ సెమిస్టర్ ఫలితాలను గురువారం ప్రిన్సిపాల్ ఏసీఆర్ దివాకర్ రెడ్డి విడుదల చేశారు. 5వ సెమిస్టర్‌లో 1,261 మందికి గాను 862 మంది (68శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఆర్ట్స్‌లో 60 శాతం, కామర్స్ లో 74 శాతం, సైన్స్‌లో 71 శాతం ఉత్తీర్ణులయ్యారు. అలాగే 3వ సెమిస్టర్‌లో 855 మందికి గాను 449 మంది (53 శాతం) విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొదటి సెమిస్టర్‌లో 1,028 మందికి గాను 657 మంది (64) విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ చలపతి, ప్రభాకర్ రెడ్డి, ఫుల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడి

ఉరవకొండ: చాక్లెట్లు ఇస్తానంటూ మాయ మాటలు చెప్పి బాలికపై లైంగిక దాడికి ఒడిగట్టిన ఓ యువకుడిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఉరవకొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన మేరకు.. విడపనకల్లు మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు సాయినాథ్.. తన పక్కింట్లో నివసిస్తున్న తొమ్మిదేళ్ల బాలికపై కన్నేశాడు. మూడు రోజుల క్రితం ఇంటి వద్ద ఆడుకుంటున్న బాలిక వద్దకు వెళ్లాడు. చాక్లెట్లు ఇస్తానంటూ లోపలికి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆలస్యంగా గుర్తించిన బాలిక తల్లి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

తాగునీరు సక్రమంగా సరఫరా కావాలి

- అప్రమత్తంగా ఉంటూ సమస్యలు పరిష్కరించాలి
- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం

అనంతపురం అర్బన్: 'వేసవిలో తాగునీటి సరఫరా సక్రమంగా చేపట్టేందుకు గ్రామ పంచాయతీల్లో రూ.38.28 కోట్లు నిధులు ఉన్నాయి. మండల, జిల్లా పరిషత్‌లోనూ నిధులు ఉన్నాయి. రానున్న మూడు నెలలు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి' అని కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. కలెక్టర్ గురువారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీఏబీఆర్ నీటిని జాగ్రత్తగా వినియోగించాలన్నారు. పైప్‌లైన్ లీకేజీలు, అదనపు వాల్ డీపాల్ట్‌లను అరికట్టడంతో పాటు జల్ జీవన్ మిషన్ పనులు త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాలో ఫిర్యాదుల స్వీకరణకు కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమస్య గుర్తించిన వెంటనే యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలన్నారు. ఎక్కడైనా అడ్డంకులు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఉరవకొండ ప్రాంతంలో నీటి సమస్యపై ఫిర్యాదులు వస్తున్నాయని, క్షేత్రస్థాయిలో పర్యటించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

ఫిర్యాదుల స్వీకరణకు టోల్ ఫ్రీ నంబర్లు



అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం. గౌతమి తెలిపారు. అందులో భాగంగా ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్లు, కమాండ్ కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉంచామన్నారు. 1950, 1800-4258802, 1800-4258803, 1800-4248804తో పాటు కమాండ్ కంట్రోల్ రూమ్ నంబర్లు 08554-231722, 08554-231922, 08554-232922కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయవచ్చన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బు, మద్యం, వస్తు సామగ్రి, తదితర వాటిని పంపిణీ చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. డబ్బు పంచుతున్నా, ఓటర్లను ప్రలోభపెడుతున్నా, ఎన్నికలకు సంబంధించి సమస్యలు ఉన్నా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు మూడు షిఫ్టుల్లో పనిచేస్తాయన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన జరగకుండా ఎఫ్ఎస్, ఎస్ఎస్, ఎంసీసీ బృందాలు చర్యలు తీసుకుంటాయని వివరించారు.

గుర్తింపు కార్డుతో ఓటు వేయవచ్చు

ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఓటరు గుర్తింపు (ఎపిక్) కార్డు లేకపోయినా ఏదేని ఫొటో గుర్తింపు కార్డు చూపి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని సూచించారు.

గుర్తింపు కార్డులు ఇవే...

ఆధార్ కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు, బ్యాంక్, పోస్టాఫీసు జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్‌బుక్, ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డ్, ఎన్‌పీఆర్ కింద ఆర్‌జీఐ జారీ చేసిన స్మార్ట్ కార్డు, భారతీయ పాస్‌పోర్ట్, ఫొటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు ద్వారా ఉద్యోగులకు జారీచేసి ఫొటో గుర్తింపుకార్డులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు జారీ చేసిన గుర్తింపు కార్డులు, ప్రత్యేక వైకల్యం ఐడీ కార్డు.

రెండు రోజుల్లో బిల్లులు అప్‌లోడ్ చేయండి

అనంతపురం సిటీ: మరో రెండు రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన బిల్లులన్నీ వెంటనే అప్‌లోడ్ చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ చీఫ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి ఆదేశించారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల అధికారులతో గురువారం అనంతపురంలోని రీజినల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం కింద సబ్ డివిజన్ల వారీగా మంజూరైన, చేపట్టిన, పూర్తయిన పనులపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ గడువులోపు పనులు పూర్తి చేయాలన్నారు. ఇప్పటి వరకు పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లులు అప్‌లోడ్ చేయాలన్నారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ఏమాత్రం జాప్యం చేయరాదన్నారు. గ్రామ సచివాలయాలు, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాల భవన నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయంలో వంద శాతం పూర్తి చేసి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన శింగనమల, అనంతపురం రూరల్ డీఈఈ రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డిని అభినందించారు.కార్యక్రమంలో అనంతపురం పీఆర్ ఎస్ఈ ఈరాస్వామి, ఈఈ చంద్రశేఖర్, డీఈఈలు రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా పీఆర్ హెడ్ మురళీ, పీఏలు గురుమూర్తి, శ్రీనివాసమూర్తి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు రాజన్న, మురళీ, రాజనీకాంత్, వెంకటరమణ, హరి, మధు, మల్లికార్జున, ఏఈ హుస్సేన్‌బాషా, లక్ష్మీదేవి, తదితరులున్నారు.

గరుడ వాహనంపై నృసింహుడు





ఆలయంలో భక్తుల రద్దీ (ఇన్‌సెట్) గరుడ వాహనంపై దర్శనమిస్తున్న ఖాద్రీశుడు

కదిరి: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. స్వామివారు 10వ రోజు గురువారం మరోసారి గరుఢా రూఢుడై తిరువీధుల్లో దర్శనమిచ్చారు. ఉత్సవాలకు అధిపతి అయిన బ్రహ్మ ప్రజల కోరిక మేరకు తన ఇష్ట వాహనమైన గరుత్మంతున్ని నారసింహునికి వాహనంగా మరోసారి పంపుతారు. దీన్నే ప్రజా గరుడసేవ.. మలి గరుడసేవ అని కూడా అంటారు. మోహినీ ఉత్సవంలో ముందు రోజు తిరువీధుల్లో ఊరేగిన శ్రీవారు రాత్రి 7 గంటలకు తిరిగి ఆలయానికి చేరుకున్నారు. నిత్యపూజలు, గ్రామోత్సవం అనంతరం మళ్లీ రాత్రి గరుడ వాహనంపై ఆలయ ప్రాంగణంలో కొలువుదీరారు. అలంకరణ ముగిసిన వెంటనే స్వామి వారికి ప్రధాన అర్చకులు దివ్య మంగళ హారతినిచ్చారు. అప్పటికే రాజగోపురం వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్న భక్తులు తమ ఇలవేల్పును దర్శించుకున్నారు. తర్వాత స్వామి వారు గరుడ వాహనంపై తిరువీధుల్లో విహరించారు. భక్తుల కాలక్షేపం కోసం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

బాబు 'షో' అట్టర్ ఫ్లాప్



రాప్తాడులో మద్యం దుకాణం వద్ద బారులు తీరిన తెలుగు తమ్ముళ్లు



చంద్రబాబు మాట్లాడుతుండగానే వెనుదిరుగుతున్న దృశ్యం

- రాప్తాడు, బుక్కరాయసముద్రం సభలకు జనం కరువు
- చంద్రబాబు రాకముందే వెనుదిరిగిన వైనం

రాప్తాడు/రాప్తాడురూరల్/బుక్కరాయసముద్రం: ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబు గురువారం రాప్తాడు, బుక్కరాయసముద్రంలో నిర్వహించిన 'షో'లు అట్టర్‌ఫ్లాప్ అయ్యాయి. జన సమీకరణకు రాప్తాడు, శింగనమల టీడీపీ అభ్యర్థులు పరిటాల సునీత, బండారు శ్రావణి పడరాని పాట్లు పడ్డారు. పక్క నియోజకవర్గాల నుంచి తరలించే ఏర్పాట్లు చేసినా సభలకు అంతంతమాత్రంగానే జనం వచ్చారు. వారు కూడా చంద్రబాబు రాకముందే వెనుదిరగడం గమనార్హం.

మద్యం దుకాణాలు కిటకిట

చంద్రబాబు కథ దేవుడెరుగు ముందు మద్యం దుకాణాలకు పోదాం.. పూటుగా సేవిద్దాం అన్నట్లుగా సభలకు వచ్చిన తమ్ముళ్లు వ్యవహరించారు. బాబును చూసేకంటే కూడా మద్యం షాపుల వద్దకు వెళ్లేందుకే ప్రాధాన్యత ఇచ్చారు. తెలుగు తమ్ముళ్ల తాకిడి ఎక్కువ కావడంతో వారిని నియంత్రించేందుకు రాప్తాడులోని మద్యం దుకాణం వద్ద ప్రత్యేకంగా ఇద్దరు పోలీసులను నియమించాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రసంగం.. నిరుత్సాహం..

చంద్రబాబు ప్రసంగం కూడా ఆద్యంతం నిరుత్సాహంగా సాగింది. కార్యకర్తలను రెచ్చగొట్టడమే ధ్యేయమన్నట్లుగా ఆయన మాట్లాడారు. కూటమి అధికారంలోకి రాగానే ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకుంటామని ఆయన అనడం చూసి స్థానికులు నవ్వుకున్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు పర్యటన చప్పగా సాగడంతో టీడీపీ శ్రేణుల్లో నైరాశ్యం నెలకొంది.

ప్రజలకు తప్పని ఇక్కట్లు

చంద్రబాబు పర్యటనలో పలువురు టీడీపీ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించారు. రోడ్లను మూసేశారు. ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు కూడా దారి లేకుండా చేశారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

33 శాఖల ఉద్యోగులకు 'పోస్టల్ బ్యాలెట్'

అనంతపుర అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో అత్యవసర సేవలు అందించే 33 శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశాన్ని భారత ఎన్నికల సంఘం కల్పించిందని డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్రో, రైల్వే రవాణా (ప్రయాణికులు, సరుకు) సేవలు, పోలింగ్ రోజు కార్యకలాపాలు కవర్ చేయడానికి కమిషన్ ఆమోదంతో అధికారిక లేఖలు జారీ అయిన మీడియా వ్యక్తులు, విద్యుత్ శాఖ, బీఎస్ఎన్ఎల్, పోస్టల్ అండ్ టెలిగ్రామ్, దూరదర్శన్, ఆకాశవాణి, రాష్ట్ర మిల్క్ యూనియన్- మిల్క్ కో-ఆపరేటివ్ సొసైటీలు, ఆరోగ్య శాఖ, ఫుడ్ కార్పొరేషన్, విమానయాన, రోడ్డు రవాణా సంస్థ, అగ్నిమాపక, ట్రాఫిక్ పోలీసు, అంబులెన్స్ సేవలు, షిప్పింగ్, ఫైర్‌ఫోర్స్, జైలు, ఎక్సైజ్, వాటర్ అథారిటీ, ఖజానా, అటవీ, సమాచార-పౌర సంబంధాల శాఖ, ఎనర్జీ, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, పీడబ్ల్యూడీ శాఖ, నేషన్ ఇన్ఫర్మేటిక్ సెంటర్, విపత్తు నిర్వహణ శాఖలను నోటిఫై చేస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు విడుదల చేసిందన్నారు. అధికారులు తమ శాఖల ఉద్యోగులకు ఈ విషయం తెలియజేసి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా చూడాలన్నారు.

నూతన వంగడాలపై దృష్టి సారించండి

అనంతపురం సెంట్రల్: నూతన వంగడాల సృష్టిపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరమ్మ అన్నారు. గురువారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఏడీఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఆమె మాట్లాడుతూ వేరుశనగ కే6 రకాన్ని దాదాపు 10 సంవత్సరాలుగా జిల్లా రైతులు సాగు చేస్తున్నారన్నారు. దీంతో దిగుబడులు తగ్గిపోతున్నాయన్నారు. వర్షాభావాన్ని తట్టుకొని, జిల్లా రైతాంగానికి మేలు చేసే రకాల ఉత్పత్తికి కృషి చేయాలని శాస్త్రవేత్తలను కోరారు. పలువురు శాస్త్రవేత్తలు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులను తట్టుకొని అధిక దిగుబడులనిచ్చే కదిరి-9, లేపాక్షి-1812, టీసీజీఎస్ 1694(వశిష్ట) రకాలను రైతులకు సరఫరా చేయాలని సూచించారు. కంది పంటలో ఎల్ఆర్‌జీ-41 రకానికి బదులు పీఆర్‌జీ-176 రకాలను, కొర్రపంటలో సూర్యనంది, గరుడ రకాలను అందించాలన్నారు. కార్యక్రమంలో రేకుల కుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి తదితరులున్నారు.

క్లుప్తంగా

నెట్టికంటుడి హుండీ ఆదాయం రూ.13.57 లక్షలు


హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు ప్రక్రియ గురువారం చేపట్టారు. 23 రోజులకు గానూ రూ.13,57,847 లక్షల నగదు, అన్నదానం హుండీ ద్వారా రూ.20,850 నగదు సమకూరినట్లు ఆలయ ఈఓ భద్రాజీ తెలిపారు. అలాగే 320 గ్రాముల వెండి, 008.5 గ్రాముల బంగారాన్ని భక్తులు స్వామి వారికి సమర్పించినట్లు వివరించారు. కార్యక్రమాన్ని ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు, పోలీస్ సిబ్బంది పర్యవేక్షించారు.

రైతుపై ఎలుగుబంటి దాడి

కళ్యాణదుర్గం రూరల్: పొలం పనుల్లో నిమగ్నమైన రైతుపై ఎలుగుబంటి దాడి చేసింది. వివరాలు... కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన ఈడిగ గోవిందరాజులు గురువారం ఉదయం ఉప్పొంక గ్రామ సమీపంలో ఉన్న తన పొలంలో పనుల్లో నిమగ్నమయ్యాడు. ఆ సమయంలో అటవీ ప్రాంతం నుంచి ఎలుగుబంటి ఒక్కసారిగా గోవిందరాజులుపై దాడి చేసింది. గమనించిన సమీప పొలాల్లోనే రైతులు మూకుమ్మడిగా కేకలు వేయడంతో ఎలుగుబంటి బెదిరి అటవీ ప్రాంతంలోకి పరుగు తీసింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన గోవిందరాజులును వెంటనే స్థానిక సీహెచ్‌సీకి తరలించారు.

సరిహద్దులు మీరకుండా

- ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఐదు చెక్‌పోస్టుల ఏర్పాటు
- కర్ణాటక నుంచి వచ్చే ప్రతి వాహనంపై ప్రత్యేక నిఘా
- అక్రమంగా మద్యం, నగదు, వస్తువుల సరఫరాను అడ్డుకోవడమే లక్ష్యం
- పర్యవేక్షణ నోడల్ ఆఫీసర్లుగా డీటీసీ, ఆర్టీఓ నియామకం

అనంతపురం సెంట్రల్: జిల్లాలో ప్రశాంత ఎన్నికలు నిర్వహించేలా పోలీసు, రవాణా, సెబ్, ఆదాయపన్నుల శాఖ అధికారులు సంయుక్త చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సరిహద్దులు దాటి మద్యం, నగదు, గిఫ్ట్ సామగ్రి ఏదీ జిల్లాలోకి అక్రమంగా చొరబడకుండా 24 గంటలూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో కర్ణాటక సరిహద్దున ఉన్న జిల్లాలోని రాయదుర్గం, కల్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల పరిధిలో ఐదు ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. విడపనకల్లు, డొనేకల్లు, ఓబుళాపురం, రాయదుర్గం సమీపంలో పైతోట గాలిమారెమ్మ ఆలయం, కంబదూరు చెక్‌పోస్టుల్లో మూడు శాఖల అధికారుల నేతృత్వంలో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు.


డొనేకల్లు చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఆర్టీఏ అధికారులు (ఫైల్)

ఆధారాలు చూపితేనే..

ఎన్నికల నిబంధనల మేరకు ఎలాంటి ఆధారాలు లేకుండా డబ్బు, మద్యం, చీరలు, గిఫ్ట్ సామగ్రి తదితరాలను తరలించకూడదు. ఒకవేళ ఎవరైనా వీటిని తరలిస్తూ చెక్‌పోస్టుల వద్ద పట్టుబడితే వాటికి సంబంధించిన సరైన ఆధారాలు చూపించాల్సి ఉంటుంది. లేకపోతే సీజ్ చేస్తారు. ఈ ప్రక్రియ నిమిషాల వ్యవధిలోనే పూర్తవుతుంది. ఇందు కోసం జిల్లాలోని ఐదు ప్రత్యేక చెక్‌పోస్టుల్లో ప్రత్యేకంగా ఎక్సైజ్, ఇన్‌కంట్యాక్స్, ఆర్టీఓ అధికారులతో పాటు ఇద్దరు హోంగార్డులు విధుల్లో ఉంటున్నారు. ఫిబ్రవరి 12 తేదీ నుంచి ఈ ఐదు చెక్‌పోస్టుల్లో ఆయా శాఖల అధికారులు రేయింబవళ్లూ పనిచేస్తున్నారు.

నోడల్ ఆఫీసర్లుగా డీటీసీ, ఆర్టీఓ..

ఎన్నికల నోడల్ ఆఫీసర్లుగా ఉప రవాణా కమిషనర్ వీర్రాజు, ఆర్టీఓ సురేష్‌నాయుడును నియమించారు. ట్రాన్స్‌పోర్టు నోడల్ ఆఫీసర్‌గా డీటీసీ వీర్రాజు వ్యవహరిస్తూ ఎన్నికలు సజావుగా సాగేందుకు అవసరమైన వాహనాలను సమకూర్చనున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే 26 వాహనాలను సేకరించి స్క్వాడ్‌కు అప్పగించారు. ఈఎస్ఎంఎస్ (ఎలక్షన్ సీజ్ మేనేజ్‌మెంట్ సిస్టం) నోడల్ ఆఫీసర్‌గా ఆర్టీఓ సురేష్‌నాయుడు నియమితులయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐదు చెక్‌పోస్టుల్లో పట్టుబడిన డబ్బు, మద్యం, సీజ్ చేసిన వాహనాల వివరాలను ఎప్పటికప్పుడు ఎలక్షన్ కమిషన్ దృష్టికి ఆయన తీసుకెళుతుంటారు. కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూం వేదికగా వీరిద్దరూ పనిచేస్తుంటారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే సీజ్



ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో ఐదు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశాం. 24 గంటలూ ఈ చెక్‌పోస్టుల్లో వాహనాల తనిఖీ జరుగుతోంది. ఇందు కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించాం. అక్రమంగా మద్యం, డబ్బు, ఇతర వస్తువులను తరలిస్తే వాటిని సీజ్ చేయడంతో పాటు సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేస్తారు. వాహనాలనూ సైతం సీజ్ చేస్తాం. – వీర్రాజు, ఉపరవాణా కమిషనర్

నెట్టికంటుడిని దర్శించుకున్న అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్మన్


తీర్థప్రసాదాలను అందజేస్తున్న ఈఓ భద్రాజీ

గుంతకల్లు రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రియల్ ఎస్టేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్మన్ ఎం.గంగారావు గురువారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ మర్యాదలతో ఈఓ భద్రాజీ, అర్చకులు స్వాగతం పలికారు. విశేష పూజల అనంతరం స్వామి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు. ఆలయ ప్రాముఖ్యతను అర్చకులు వివరించారు.

ఆటో బోల్తా - బాలిక మృతి


మృతి చెందిన రక్షిత

గుమ్మఘట్ట: ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ బాలిక మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... గుమ్మఘట్ట మండలం గొల్లపల్లికి చెందిన తిప్పేస్వామి, సాకమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కూలి పనులతో జీవనం సాగించేవారు. వీరి కుమార్తె రక్షిత (17) 74 ఉడేగోళం వద్ద ఉన్న గార్మెంట్స్ పరిశ్రమలో కార్మికురాలిగా పనిచేస్తూ కుటుంబానికి చేదోడుగా నిలిచింది. ఈ క్రమంలో గురువారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు ఆటోలో బయలుదేరింది. మార్గమధ్యంలో కరిసూరయ్యదొడ్డి వద్దకు చేరుకోగానే ఆటో అదుపు తప్పి బోల్తాపడడంతో రక్షిత అపస్మారక స్థితికి చేరుకుంది. స్థానికులు వెంటనే ఆమెను రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కాగా, రక్షిత మృతి విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి ఫోన్ ద్వారా బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

క్రమశిక్షణ మీరితే చర్యలు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ సిద్ధాంతాలకు లోబడే ఎవరైనా పనిచేయాల్సి ఉంటుందని, అతిక్రమించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. గురువారం ఆయన వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ రాప్తాడు నియోజకవర్గ నాయకులతో కలసి విలేకరులతో మాట్లాడారు. బోయ రాజారాం, ఈశ్వరయ్యకు వైఎస్సార్ సీపీ సముచిత స్థానం ఇచ్చిందన్నారు. కానీ వారు ఇటీవల పార్టీ నియమాలను ఉల్లంఘిస్తూ వ్యవహరిస్తున్నారన్నారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గౌరవ ప్రతిష్టలకు భంగం కలిగేలా విమర్శలు చేయడాన్ని ఆయన ఖండించారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతమైతే పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామన్నారు. వైఎస్ జగన్ పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందారన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలోనే బడుగులకు రాజ్యాధికారం దక్కిందన్నారు. ఎవరెన్ని విమర్శలు చేసినా అన్ని వర్గాల ప్రజలకు మేలు చేయడమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమన్నారు. రాప్తాడు వైస్ ఎంపీపీ రామాంజనేయులు, రామగిరి సర్పంచ్ మీనుగ నాగరాజు, జెడ్పీటీసీ నాగార్జున, మండల కన్వీనర్ శేఖర్, నాయకులు పసుపుల ఆదినారాయణ మాట్లాడుతూ... వైఎస్సార్‌సీపీలో కొనసాగుతూ ఎన్నికల వేళ పార్టీకి ద్రోహం చేసేలా బోయ రాజారాం, ఈశ్వరయ్య వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి నాయకత్వంలో బోయ, కురుబలకు రాజకీయ ప్రాధాన్యత దక్కిందనేందుకు తామే సాక్ష్యమన్నారు. రాప్తాడులో 30 ఏళ్ల పాటు సాగిన పరిటాల కుటుంబం అరాచకానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అడ్డుకట్ట వేశారన్నారు. పరిటాల కుటుంబంతో బిల్లే ఈశ్వరయ్య లోపాయికార ఒప్పందాలు చేసుకుని నీచ రాజకీయాలకు తెరలేపాడని మండిపడ్డారు. మరోసారి రాప్తాడు ఎమ్మెల్యేపై వ్యక్తిగత విమర్శలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.

ఎమ్మెల్సీ మాతృమూర్తికి ఘననివాళి


వైకుంఠ సమారాధనలో పాల్గొన్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, సోదరులు సాయిప్రసాద్‌రెడ్డి, బాలనాగిరెడ్డి, సీతారామిరెడ్డి, కుటుంబసభ్యులు


ఎమ్మెల్యే అనంతవెంకట్రామిరెడ్డి, ఎంపీ అభ్యర్థి శంకరనారాయణతో ఎమ్మెల్యే వైవీఆర్

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్లలో ఎమ్మెల్సీ, ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ వై.శివరామిరెడ్డి మాతృమూర్తి వై.లలితమ్మకు కుటుంబసభ్యులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. కొన్ని రోజుల క్రితం ఆదోనిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ లలితమ్మ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం కొనకొండ్లలోని స్వగృహంలో వైకుంఠ సమారాధన నిర్వహించారు. లలితమ్మ చిత్రపటం వద్ద ఆమె కుమారులు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, ఎమ్మెల్యేలు వై.వెంకట్రామిరెడ్డి, వై.సాయిప్రసాదరెడ్డి, వై.బాలనాగిరెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు వై.సీతారామిరెడ్డి, కుమార్తె వరలక్ష్మి, కుటుంబసభ్యు లు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉరవకొండ, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం నియోజవర్గాలతోపాటు కర్నూలు, కడప, కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి పలువురు ప్రజాప్రతినిధులు, అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. ఉరవకొండ వైఎస్సార్‌సీపీ ఎమ్మె ల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి, రాయదుర్గం అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి, అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి శంకరనారాయణ, ఎమ్మె ల్యేలు అనంతవెంకట్రామిరెడ్డి, కాపు రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ వెన్నపూస రవీంద్రారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు మధుసూదన్‌రెడ్డి, శ్రీశైలం దేవస్థాన కమిటీ సభ్యుడు విరూపాక్షయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

పది మంది 'లా' విద్యార్థుల డిబార్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ కళాశాలలో జరుగుతున్న ఎల్ఎల్‌బీ మూడు, ఐదు సంవత్సరాలకు సంబంధించి గురువారం నిర్వహించిన ఐదో సెమిస్టర్ పరీక్షల్లో పది మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. మాస్కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడిన వారిపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కాగా, పరీక్ష కేంద్రాన్ని ఎస్కేయూ వీసీ డాక్టర్ కె.హుస్సేన్‌రెడ్డి పరిశీలించారు. పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించకపోతే చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఇన్విజిలేటర్లను ఆయన హెచ్చరించారు.

అధికారుల మధ్య సమన్వయం తప్పని సరి


మాట్లాడుతున్న కేతన్‌గార్గ్

కూడేరు: ఎన్నికల ప్రక్రియ విజయవంతం కావాలంటే మండల, సెక్టార్ అధికారులు, సూపర్ వైజర్ల మధ్య సమన్వయం తప్పని సరిగా ఉండాలని ఉరవకొండ నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేతన్‌గార్గ్ సూచించారు. ఎన్నికల నిర్వాహణపై గురువారం ఆయన కూడేరు తహసీల్దార్ కార్యాయంలో అధికారులతో సమీక్షించారు. ఎన్నికల విధులపై నిర్లక్ష్యం వహించరాదన్నారు. పోలింగ్ కేంద్రాలను తరుచూ సందర్శించి మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలన్నారు. ఎన్నికల నిబంధనలను పక్కాగా అమలు చేయడంతో పాటు వాహనాల తనిఖీని విస్తృతం చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రత్నరాధిక, ఎంసీసీ అధికారి ఎంకే బాషా, సీఐ శివరాముడు, డీటీ విశ్వనాథ్, మండల అధికారులు పాల్గొన్నారు.

పెన్నానదిలో అస్థిపంజరం

- కర్నూలు జిల్లా వాసిదిగా గుర్తింపు
- వివాహేతర సంబంధం కారణంగా 40 రోజుల క్రితం హత్య
- పామిడి పెన్నానదిలో అస్థిపంజరాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

పామిడి: వివాహేతర సంబంధం కారణంగా కర్నూలు జిల్లాలో 40 రోజుల క్రితం హతమైన వ్యక్తి... గురువారం పామిడి పెన్నానది సమీపంలో అస్థిపంజరమై తేలాడు. కర్నూలు జిల్లా దేవనకొండ సీఐ శ్రీనివాసులు తెలిపిన మేరకు... ఈ ఏడాది ఫిబ్రవరి 16న కర్నూలు జిల్లా దేవనకొండ మండలం గుండ్లకొండ గ్రామానికి చెందిన కురుబ లక్ష్మన్న (55) కనిపించకుండా పోయాడు. పలు ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లక్ష్యం కాకపోవడంతో కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు దేవనకొండ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో లక్ష్మన్న భార్య పద్మావతి, కుమారుడు వెంకటేష్ ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు తమదైన శైలిలో విచారణ చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. వివాహేతర సంబంధం కారణంగా లక్ష్మన్నను హతమార్చినట్లు పోలీసుల ఎదుట వారు అంగీకరించారు. తమ బంధువు గిడ్డి మల్లయ్యతో కలసి వెంకటేష్ ఓ వాహనంలో లక్ష్మన్న మృతదేహాన్ని తీసుకువచ్చి పామిడి బైపాస్‌లోని పెన్నానది శివారున ఉన్న ఓ మామిడితోట సమీపంలో కంపచెట్ల మధ్య పడేశారు. ఈ సమాచారంతో నిందితులను వెంటబెట్టుకుని సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు గురువారం పామిడికి చేరుకున్నారు. ముళ్ల పొదల మధ్య అస్థిపంజరాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అక్కడే పంచనామ నిర్వహించి, ఖననం చేశారు. ఘటనకు సంబంధించి పద్మావతి, వెంకటేష్, గిడ్డి మల్లయ్యపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.


అస్థి పంజరాన్ని పరిశీలిస్తున్న దేవనకొండ సీఐ శ్రీనివాసులు

సీఎం జగన్‌ను కలిసిన ఆలూరు


సీఎం వైఎస్ జగన్‌తో మాట్లాడుతున్న ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రభుత్వ విద్యాసలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి బుధవారం రాత్రి కలిశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో జరిగిన మేమంతా సిద్ధం బస్సు యాత్రలో పాల్గొన్న ఆయన బహిరంగ సభ అనంతరం సీఎం జగన్‌ను కలసి మాట్లాడారు.

భంభం స్వామి సమాధిని తాకిన సూర్యకిరణాలు



రాయదుర్గం టౌన్: పట్టణంలోని భంభం స్వామి దర్గాలో భంషేక్ అబ్దుల్ స్వాముల సమాధిని సూర్య కిరణాలు తాకాయి. గురువారం ఉదయం 6.30 గంటలకు సమాధితో పాటు చిత్రపటాన్ని సూర్యకిరణాలు తాకడంతో ఆ ప్రాంతమంతా పసిడి వర్ణం నెలకొంది. ఈ దృశ్యం చూసిన భక్తులు తన్మయత్వానికి లోనయ్యారు. దర్గా నిర్వాహకులు బషీర్ అహమ్మద్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఐచర్ ఢీ కొని మహిళ మృతి


ఆదిలక్ష్మి మృతదేహం

గుత్తి రూరల్: ఐచర్ ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దవడుగూరుకు చెందిన బాబు, ఆదిలక్ష్మి దంపతులు నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం కటారుకొండ గ్రామంలో జరిగిన బంధువుల వివాహానికి ద్విచక్ర వాహనంలో వెళ్లారు. పెళ్లి వేడుక చూసుకుని గురువారం తిరుగు ప్రయాణమైన వారు గుత్తి మండలం బాచుపల్లి శివారులోకి చేరుకోగానే 44వ జాతీయ రహదారిపై వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన ఐచర్ వాహనం ఢీకొంది. ఘటనలో ఆదిలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందగా బాబు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని క్షతగాత్రుడిని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

నలుగురు వలంటీర్ల సస్పెన్షన్

అనంతపురం అర్బన్: ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంగించిన నలుగురు వలంటీర్లను కలెక్టర్ గురువారం సస్పెండ్ చేశారు. సస్పెండ్ అయిన వారిలో వజ్రకరూరుకు చెందిన సిద్రప్పగారి శివయ్య, రాకెట్ల రమేష్, మహబూబ్ బాషా, నార్పల మండలం సిద్దరాచర్లకు చెందిన ఎం.సాయినాథ్‌రెడ్డి ఉన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన కారణంగా ఇప్పటి వరకూ 40 మంది వలంటీర్లు, ఐదుగురు రేషన్ డీలర్లు, 11 మంది కాంట్రాక్టు ఉద్యోగులు, ఒకరు శాశ్వత ఉద్యోగి సస్పెన్షన్‌కు గురయ్యారు. అలాగే ఎన్నికల షెడ్యూల్ విడుదలైన ఈ నెల 16 నుంచి ఇప్పటి వరకూ రూ.26,46,800 నగదు సీజ్ చేశారు. అదే విధంగా రూ.32,16,070 విలువ చేసే 4,340.34 లీటర్ల మద్యం సీజ్ చేశారు.

రేపు ఎల్ఐపీ ఎండ్‌లైన్ టెస్ట్

అనంతపురం ఎడ్యుకేషన్: అన్ని ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల్లో 6, 7, 8 తరగతుల విద్యార్థులకు ఈ నెల 30న లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (ఎల్ఐపీ) ఎండ్‌లైన్ టెస్ట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంఈఓలు, హెచ్ఎంలకు డీఈఓ వరలక్ష్మి, సమగ్ర శిక్ష ఏపీసీ వరప్రసాదరావు గురువారం ఆదేశాలు జారీ చేశారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లో ఈ పరీక్ష ఉంటుంది. ఆయా సబ్జెక్టు టీచర్లు చొరవ తీసుకుని డిజిటల్ రూపంలో ఉన్న ప్రశ్న పత్రాన్ని ఐఎఫ్‌పీ, స్మార్ట్‌టీవీల్లో చూపించి పరీక్ష రాయించాలి. ఏ ఒక్క పాఠశాలకు మినహాయింపు లేదు.

క్లుప్తంగా

హుండీకానుకల లెక్కింపు



ఆలయంలో హుండీకానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

ఆత్మకూరు: పంపనూరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో గురువారం ఆలయ సిబ్బంది, గ్రామస్తుల ఆధ్వర్యంలో హుండీకానుకల లెక్కింపు నిర్వహించారు. రూ.9,96,076 ఆదాయం వచ్చినట్లు ఈఓ శోభ తెలిపారు. అనంతరం స్వామికి అభిషేకాలతో పాటు విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

కనగానపల్లి: మండలంలోని శివపురం, వేపకుంట గ్రామాల్లో టీడీపీకి చెందిన పలువురు నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి వీరికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో కురుబ మల్లికార్జున, మాదిగ మురళి, రామలింగ తదితరులు ఉన్నారు.

కూటమిని తరిమికొడదాం



గాండ్లపర్తిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాప్తాడు: పొత్తులతో ఎన్నికలకు వస్తున్న కుటమిని తరిమికొట్టాలని వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని గాండ్లపర్తిలో గురువారం ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి సస్యశ్యామలం చేసిన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ఎన్నికల విభాగం మండల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, బీసీ సెల్ నాయకుడు వసుపుల ఆది పిలుపునిచ్చారు. చంద్రబాబు నాయుడు గత 9 ఏళ్ల టీడీపీ పాలనలో మహిళల్ని దారుణంగా మోసం చేశారని గుర్తు చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు కొట్టే దెబ్బతో చంద్రబాబుకు రాజకీయ సన్యాసం తప్పదని జోస్యం చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, హిందూపురం ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మను అత్యధిక మోజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం



కార్యాలయం ముందు గుమ్మడికాయ కొడుతున్న తోపుదుర్తి రాజశేఖరరెడ్డి

చెన్నేకొత్తపల్లి: త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలోని పెనుకొండకు వెళ్లే దారిలో ఏర్పాటు చేసిన నూతన వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని పార్టీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖరరెడ్డి గురువారం ప్రారంభించారు. అనంతరం అర్చకులు కార్యాలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి మండలంలోని పలు గ్రామాల నుంచి పార్టీ నాయకులు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ ఎం.గోవిందరెడ్డి, కన్వీనర్ నర్సిరెడ్డి, చెన్నేకొత్తపల్లి సర్పంచ్ ధనుశ్రీ, సొసైటీ అధ్యక్షుడు డోలా రామచంద్రారెడ్డి నాయకులు వన్నాహనుమంతరెడ్డి, పుల్లారెడ్డి, నరసింహారెడ్డి, శివారెడ్డి, ఎస్టీడీ శ్రీనివాసరెడ్డి, రాము, రామయ్య, బొగ్గు ప్రసాద్, కిష్ట, ఓబులేసు, లింగమయ్య, కుళ్లాయప్ప, నారాయణ స్వామి, కిష్టప్ప, నాగభూషణ, సుబ్బిరెడ్డి పాల్గొన్నారు.

మహిళా న్యాయవాదిపై దాడి



చికిత్స పొందుతున్న న్యాయవాది లక్ష్మి

అనంతపురం ఎడ్యుకేషన్: మహిళా న్యాయవాది కే.లక్ష్మిపై విరాజ్ బిల్డర్స్ అధినేత టి.సోమశేఖర్ రెడ్డి, వడ్డే భానుమూర్తి గురువారం దాడి చేశారు. బాధితురాలు తెలిపిన వివరాలు.. అనంతపురం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో ఓ స్థలం రిజిస్టర్ చేయించే విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. తాను న్యాయవాది అని చెప్పినా వినకుండా.. న్యాయవాది అయితే ఏంటని అసభ్య పదజాలంతో దాడి చేసినట్లు లక్ష్మి వాపోయింది. బాధితురాలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. న్యాయవాదులు సి.హనుమన్న, హాజీజ్ తదితరులు లక్ష్మిని పరామర్శించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దాం

- అభివృద్ధి, సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం
- భారీ మెజారిటీతో గెలిపించాలి
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి





శివపురంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ప్రజలకు నమస్కరిస్తూ ముందుకు సాగుతున్న దృశ్యం

కనగానపల్లి: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలి. రాప్తాడులో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని శివపురం, కేఎస్ పాళ్యం, మద్దెలచెరువు, వేపకుంట, భానుకోట, కొండపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ప్రతి గ్రామంలోనూ మహిళలు, యువకులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు వారికి ఘన స్వాగతం పలికారు. ఉదయం 10 గంటలకు శివపురంలో ప్రారంభమైన ప్రచారం రాత్రి 8 గంటలకు కొండపల్లిలో ముగిసింది. నవరత్నాల్లోని పథకాల ద్వారా పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే సీఎం జగన్ ఎజెండా అని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి తెలిపారు. శివపురం, మద్దెలచెరువు, భానుకోట గ్రామాల్లో జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారన్నారు. డీబీటీ పద్ధతిలో 130 సార్లు బటన్ నొక్కి రూ.2.75 లక్షల కోట్లను పేద ప్రజలకు నేరుగా అందజేశారన్నారు. టీడీపీ నేత చంద్రబాబు తన 14 ఏళ్ల పాలనలో ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని అమలు చేయకుండా ప్రజలను కల్లిబొల్లి మాటలతో మోసం చేశారన్నారు. అధికారం కోసం ప్రతి ఎన్నికల్లోనూ ఎవ్వరితో ఒక్కరితో పొత్తు పెట్టుకొని లబ్ధి పొందుతారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ఈసారి కూడా అన్ని పార్టీలతో జతకట్టి ప్రజలను మోసం చేయడానికి వస్తున్నాడని తెలిపారు. ప్రజలు చంద్రబాబుకు తగిన తగిన గుణపాఠం చెబుతారన్నారు.

పరిటాల కుటుంబాన్ని తరిమేద్దాం

25 ఏళ్ల పాటు ఫ్యాక్షన్ రాజకీయాలతో పెనుగొండ, రాప్తాడు నియోజకవర్గాలను అతలాకుతలం చేసిన పరిటాల కుటుంబాన్ని వచ్చే ఎన్నికల్లో కూడా ఓడించి నియోజకవర్గం నుంచి శాశ్వతంగా తరిమేద్దామని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. పరిటాల రవీంద్ర హయాంలో రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో జరిగిన ఫ్యాక్షన్ , వర్గ కక్షలతో వందలాది మంది ప్రాణాలు పోగొట్టుకున్నారని తెలిపారు. పరిటాల సునీత ధన దాహం వల్ల ఇక్కడి పేద ప్రజలకు ఎటువంటి న్యాయం జరగలేదన్నారు. పరిటాల కుటుంబ సభ్యులు మాత్రం రెండు ఎకరాల నుంచి రూ.2 వేల కోట్లకు ఎదిగారని విమర్శించారు. కాని వారి సొంత మండలం రామగిరిలో ఉన్న పేరూరు డ్యాంకు చుక్కనీరు కూడా తీసుకుని రాలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో ఎక్కడా ఫ్యాక్షన్ గొడవులు లేకుండా గ్రామాల్లో ప్రజలంతా జీవిస్తున్నారన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్ సహకారంతో అధికారంలోకి వచ్చిన యేడాది లోపల పేరూరు డ్యాంకు కృష్ణా జలాలు తీసుకొచ్చామన్నారు. సొంత నిధులతో రైతులకు ఉచితంగా బోర్లు వేయించటంతో పాటు కి.మీ పొడవున కాలువలు తవ్వించి ప్రజలకు సాగు, తాగునీరు అందిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాలు గంగుల భానుమతి, సుధీర్‌రెడ్డి, నరసింహాగౌడ్, ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మారుతి ప్రసాద్, వైస్ ఎంపీపీ పద్మావతి, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

కనగానపల్లి: మండలంలోని శివపురం, వేపకుంట గ్రామాల్లో టీడీపీకి చెందిన పలువురు నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి వీరికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో కురుబ మల్లికార్జున, మాదిగ మురళి, రామలింగ తదితరులు ఉన్నారు.

టీడీపీకి గుడ్‌బై..



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ పరిధిలోని బీఎస్ఆర్ కాలనీ, సిండికేట్ నగర్ కొట్టాలకు చెందిన పలువురు టీడీపీని వీడి వైస్సార్‌సీపీలో చేరారు. గురువారం రాచానపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వడ్డే ఆనంద్, కొండపల్లి చాకలి శ్రీరాములు, బోయ నరేష్, బోయ రమేష్, బోయ సిద్ధా, బోయ రామలింగ, బోయ వంశీ, ఓ.వెంకటేష్ ఆచారి, దూదేకుల సుభహాన్, మంజునాథ్, కుమ్మర దేవ, సాయి, రవితేజ, వడ్డే తిమ్మన్న, కుమ్మర నాగరాజు, వడ్డే రంగా ప్రసాద్ తదితర 18 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. పేదలు అభివృద్ధి చెందాలంటే మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ధనుంజయ యాదవ్, ట్రేడ్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు బండి పవన్, సర్పంచ్ బండా అంజియాదవ్, నాయకులు భానుకోట శివ, కొడిమి తిరుపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొహిద్దీన్ మసీదులో ఇఫ్తార్ విందు



భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం కల్చరల్: నగరంలోని మొదటి రోడ్డు మస్జిద్ ఏ మొహిద్దీన్ అష్రఫియాలో గురువారం రాత్రి ఇఫ్తార్ విందు జరిగింది. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఉపవాస దీక్షాపరులకు స్వయంగా భోజనం వడ్డించారు. పలువురు మైనార్టీ నాయకులు, మతపెద్దలు ఎమ్మెల్యే అనంతకు ఖర్జూరాలు తినిపించారు. కుల మతాలకు అతీతంగా ఇఫ్తార్ విందుల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు సైపుల్లా బేగ్, వక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మైనార్టీ నాయకులు నియాజ్, కొర్రపాడు హుస్సేన్‌పీరా, నదీమ్, జావిద్, అనిల్‌కుమార్ గౌడ్, కార్పొరేటర్లు శేఖరబాబు, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రకాష్‌రెడ్డిని గెలిపించుకుందాం



పంపనూరులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: సీఎం జగన్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారు. గతంలో ఎప్పుడూ జరగని విధంగా నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. మండలంలోని పంపనూరు, పంపనూరు తండా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు యథావిధిగా అందాలంటే వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని కోరారు. టీడీపీకి ఓటు వేస్తే పథకాలన్నీ రద్దు చేస్తారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి చేసిన మంచిన ఓర్వలేక టీడీపీ నాయకులు ఎల్లో మీడియా అసత్య ప్రచారాలు చేస్తున్నాయని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో ప్రకాష్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కన్వీనర్ లక్ష్మీనరసింహులు, ఎంపీపీ హేమలత, వైస్ ఎంపీపీ విజయ్, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలపోతన్న, యూత్ కన్వీనర్ కొండా రెడ్డి, సర్పంచులు ఎర్రిస్వామి, ఉప సర్పంచ్ అశోక్, వైఎస్సార్‌సీపీ నాయకులు వాసుదేవరెడ్డి, వీరాంజనేయులు, ఫణిరెడ్డి, వన్నూరప్ప, నాగరాజు, ముత్యాలరెడ్డి, వెంకటేష్, రామచంద్ర, సింగంపల్లి వెంకటేష్, మహేష్, సూరెప్ప, బాలస్వామి రెడ్డి, మాధన్న, ఆదెప్ప, గోవింద్, అక్కులన్న, శ్రీరామ్, బాలకృష్ణ, వెంకటేష్ నాయక్, కొండన్న, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే మైనార్టీల సంక్షేమం



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: మైనార్టీల సంక్షేమం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని మేయర్ మహ్మద్ వసీం అన్నారు. గురువారం స్థానిక ఎర్రనేల కొట్టాలలోని మదీనా మసీదు ప్రాంతంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. మేయర్ వసీం, మార్కెట్‌యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు సైపుల్లా బేగ్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నియాజ్ తదితరులు సంక్షేమ పథకాలను వివరించారు. సీఎం జగన్ ముస్లింల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. వైఎస్సార్ మైనార్టీ వర్గాలకు నాలుగు శాతం రిజర్వేషన్లు అందించడంతోనే అభివృద్ధి సాధ్యమైందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్, ఎమ్మెల్యేగా అనంత వెంకటరామిరెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు లాలు, రహంతుల్లా, ఇషాక్, నాయకులు కొర్రపాడు హుస్సేన్‌పీరా, హబీబుల్లా, దాదా ఖలందర్, దాదు, రఫీ, మదార్‌వలి, షేక్షావలి, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమరెడ్డిపల్లిలో జోరుగా ప్రచారం



ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాప్తాడురూరల్: సార్వత్రిక ఎన్నికల్లో హిందూపురం ఎంపీ అభ్యర్థిని బోయ శాంతమ్మ, రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. గురువారం అనంతపురం రూరల్ మండలం కృష్ణమరెడ్డి పల్లిలో ప్రచారం చేపట్టారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేయాలని ఇంటింటికీ వెళ్లి అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ జయచంద్ర రెడ్డి, సర్పంచులు ప్రశాంత్‌కుమార్, గురుప్రసాద్, నాయకులు నరసింహ రెడ్డి, నారాయణ స్వామి, చిరంజీవి, దస్తగిరి, కె. నారాయణ స్వామి, రంగారెడ్డి, పోలేరయ్య, మంజుల సాయినాథ్, అంజి శ్రీనివాసులు, రాగే పెద్దప్ప, భాస్కర్ రెడ్డి, ఉప సర్పంచ్ కేపీ ఓబులేసు, మాజీ సర్పంచ్ ఆనంద్, జంగాలపల్లి గిరివర్ధన్ రెడ్డి, చలపతి, రవి, ఈశ్వరయ్య, రాఘవ రెడ్డి, తేజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

పక్కాగా ఎన్నికల నియమాల అమలు

అనంతపురం రూరల్: ఎన్నికల నియమాలను పక్కాగా పాటించాలని అనంతపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి గ్రంధి వెంకటేష్ ఆదేశించారు. గురువారం ఆర్డీఓ కార్యాలయంలో ఎండీయూ ఆపరేటర్లు, స్టోర్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ.. ఎన్నికల నియమాలను ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలన్నారు. ఎండీయూ వాహనాలపై, రేషన్ షాపుల దగ్గర, పది కేజీల బియ్యం ప్యాకెట్లపై ఎలాంటి ఫొటోలు, నవరత్నాల గుర్తులు లేకుండా ఎండీయూ ఆపరేటర్లు, స్టోర్ డీలర్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రేషన్ వాహనాల్లో రాజకీయ పరమైన ఆడియోలు ఉండరాదన్నారు. రాజకీయ పరమైన మీటింగ్‌లు, ర్యాలీలు, ప్రచారాల్లో పాల్గొంటే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఆర్‌ఓ శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు 22వ డివిజన్‌లో 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 22వ డివిజన్‌లో శుక్రవారం ఉదయం 7:30 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డివిజన్‌లోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న రేడియో స్టేషన్ నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు.

నేడు ఎన్నికల ప్రచారం

కనగానపల్లి: మండలంలోని నరసంపల్లి, బద్దలాపురం, యలకుంట్ల, తగరకుంట, పాతపాళ్యం, తూంచర్ల గ్రామ పంచాయతీల్లో శుక్రవారం రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తారని ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు.

ఘనంగా శివబాలయోగి మహారాజ్ ఆరాధన

అనంతపురం కల్చరల్: నగరంలోని శివబాలయోగి మహారాజ్ 30వ ఆరాధన గురువారం రాత్రి ఘనంగా జరిగింది. సామూహిక పంచామృతాభిషేకాలు, పల్లకీ సేవ, ధ్యాన భజన, అన్నప్రసాద వితరణ జరిగింది. హిందూపురం, ముదిరెడ్డి పల్లి, శివబాలయోగి మహారాజ్ ఆశ్రమాల నుంచి భక్తులు తరలివచ్చారు. తీర్థప్రసాద వితరణలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అరవింద్, రత్నగిరి దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సీఐ రవిశంకరరెడ్డికి డీజీపీ డిస్క్ అవార్డు



అనంతపురం క్రైం: అనంతపురం వన్‌టౌన్ సీఐగా పని చేసి చిత్తూరు వెస్ట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయిన రవిశంకరరెడ్డి డీజీపీ డిస్క్ అవార్డుకు ఎంపికయ్యారు. నేరాల నియంత్రణతో పాటు నేర పరిశోధనలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు డీజీపీ డిస్క్ అవార్డుల్లో బ్రాంజ్ మెడల్ వరించింది.

'రాయలసీమ ద్రోహి చంద్రబాబు'

రాప్తాడు: చంద్రబాబుకు రాయలసీమలో పర్యటించే అర్హతే లేదని వైఎస్సార్‌సీపీ ఐటీ జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ ఆధ్వర్యంలో విలేకరులతో మాట్లాడారు. రాప్తాడులో చేపట్టిన ప్రజాగళం రోడ్డు షోలో రాయలసీమ ద్రోహి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అంటూ చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. అసలైన రాయలసీమ ద్రోహి చంద్రబాబే అని ఎద్దేవా చేశారు. రాయలసీమ రాజధానికి అనుకూలమా కాదా.. టీడీపీ పార్టీ విధానం ఎంటో తెలిపి ప్రజలను ఓట్లడగాలన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఫ్యాక్షన్ పెరిగితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పూర్తిగా తగ్గిపోయిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ నాయకులు దేవేందర్, జ్ఞానేశ్వర్ రెడ్డి, కోటేశ్వరరావు, హరనాథ్ రెడ్డి, సుధాకర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పరిరక్షణపై సదస్సు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఆర్ట్స్ కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం 'మొక్కల పరిరక్షణ వ్యూహాల్లో దృక్పథం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఎస్కేయూ ప్రొఫెసర్ బి.రవిప్రసాద్ రావు ముఖ్య అతిథిగా హాజరై పర్యావరణం, జీవ వైవిధ్య విలువలు, భూమి మీద జీవం, నైతిక విలువలు తదితర అంశాలను వివరించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ఏసీఆర్ దివాకర్ రెడ్డి అధ్యక్షత వహించగా వృక్షశాస్త్రం విభాగాధిపతి శ్రీదేవి, అధ్యాపకులు పి.అమృత లక్ష్మి, ఎం.విష్ణుప్రియ, డి.రఘురాములు, బి.మనోహరరెడ్డి, పి.అక్బర్ బాషా పాల్గొన్నారు.

ఏఓ శశికళ బాధ్యతల స్వీకరణ



అనంతపురం అగ్రికల్చర్: అనంతపురం రూరల్ మండల వ్యవసాయ అధికారిగా శశికళ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ప్రసూతి సెలవు కింద నాలుగు నెలలు సెలవు తీసుకున్న ఆమె తిరిగి గురువారం విధుల్లోకి చేరారు. ఇప్పటి వరకూ ఇన్‌చార్జ్ ఏఓగా సాయి లక్ష్మి వ్యవహరించారు.

కరుణామయుడు క్రీస్తు

సందర్భం: నేడు గుడ్ ఫ్రైడే



ప్రార్థనలకు సిద్ధమైన సీఎస్ఐ చర్చి

అనంతపురం కల్చరల్: మానవేతి హాసంలో సమాధి నుంచి సజీవంగా పునరుత్థానుడైన ఏకైక వ్యక్తి దైవ కుమారుడు ఏసుక్రీస్తు. ప్రేమే మార్గంగా.. త్యాగమే ఆయుధంగా ప్రేమతో మానవాళిలోని పాపాలను కడిగివేయడానికి పాపుల కన్నీళ్లు తుడవడానికి భువిపై అవతరించిన దయామయుడు శిలువపై రక్తం చిందించిన రోజును 'గుడ్ ఫ్రైడే'గా జరుపుకుంటాం. లోకములోని సమస్త పాపాలు కడిగివేయబడి అందరినీ తన రక్తంతో.. త్యాగంతో పరిశుద్ధాత్ములుగా మార్చిన రోజు కాబట్టి శుభ శుక్రవారం అంటున్నామని మత పెద్దలు చెబుతారు. మానవత్వ విలువలను పెంచడం కోసం సిలువపై వేలాడుతూ కూడా క్షమాపణ, రక్షణ, ప్రేమ, ఎడబాటు, అకాంక్ష, విజయం, అప్పగించుట అనే ఏడు అమృతవాక్యాలను శాంతి ప్రపంచానికి అందించారు.

మూడు రోజుల పాటు ప్రార్థనలు

గుడ్ ఫ్రైడే అంటే హంగులు, ఆర్భాటాలు కాదని.. భగవంతుడికి మన హృదయాన్ని సమర్పించుకోవడమేనని పరిశుద్ధ గ్రంథం బైబిల్ ప్రవచిస్తోంది. ఏసు శిలువపై చిత్రహింసలు అనుభవించి మరణించిన మూడవ రోజు పునరుత్థానుడై లోకానికి శుభ సందేశమందించాడు. దానిని 'ఈస్టర్'గా ఆదివారం జరుపుకుంటారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే ప్రార్థనలు, శనివారం రస్ ఫర్ జీసెస్, ఆదివారం ఈస్టర్ వేడుకలకు అరవింద నగర్‌లోని సీఎస్ఐ చర్చి, సప్తగిరి సర్కిల్‌లోని ఎస్ఐయూ చర్చి, రామచంద్ర నగర్‌లోని కార్మియల్ మాత మందిరం, కోర్టు రోడ్డులోని గాస్పెల్‌హాల్, కళాకారుల కాలనీలోని రేమా చర్చి తదితర ప్రార్థనా మందిరాల్లో ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక ప్రార్థనలకు ఆహ్వానిస్తూ చర్చీలను విద్యుద్దీపాలతో అలంకరించారు.

ప్రార్థన, సేవ రెండూ ముఖ్యమే



గుడ్‌ఫ్రైడే మహోత్సవాన్ని కేవలం ప్రార్థనలతోనే కాకుండా దైవ మార్గమైన సేవలో తరించాలి. పాపులను పరిశుద్ధాత్ములుగా మార్చడానికి క్రీస్తు చూపిన త్యాగనిరతిని, కరుణామయుడి ఆదర్శ జీవితాన్ని అవగాహన చేసుకుంటే జీవితంలో ఏమి చేయాలో తెలుస్తుంది. మన హృదయాన్ని దైవకుమారుడికి సమర్పించుకోవడమే వేడుకగా భావించాలి. శాంతి కోసమే దైవకుమారుడు మనుషులతో తిరుగాడి మనల్ని పునీతుల్ని చేసి తాను శాపం అనుభవించాడు. ఆ త్యాగం వృథా కాకుండా విలువలతో జీవించాలి.

– రెవరెండ్ నెహెమ్యా నాగరాజ్, పాస్టర్ల సంఘం అధ్యక్షుడు

గుడ్ ఫ్రైడే



క్రీస్తు విధేయతా బలియాగం

క్రీస్తు మరణ, సమాధి, పునరుత్థానాల వెనుక దేవుని దివ్య సంకల్పం ఉంది. దీన్నే సువార్త అంటారు. సువార్త దేవుని సంకల్పంతో ఎప్పుడూ ముడిపడే ఉంటుంది. పూర్వపు దేవుని సంకల్పం చెప్పక దాన్ని దాటవేసే సువార్త అసలు లెస్సయైన లేఖనానుసార సువార్తగా ఎప్పటికీ కానేరదు. సువార్త పుట్టుకకు ఆయువుపట్టు వంటి దేవుని ప్రణాళికను చాలా పకడ్బందీగా, పటిష్ఠంగా వివరించుకున్ననూ అది సువార్త కాదు. సత్యవాక్యం అనే రక్షణ భాగ్యపు సువార్త ప్రకటన అపొస్తలుల బోధకు లోబడే ఉండి తీరాలి.

ఈ జగత్తుకు పునాది వేయక పూర్వమే దేవుని ఆలోచనలలో ఉన్న క్రీస్తు బలియాగం అనే 'పథక రచన' గూర్చి ఎంతగా చెప్పుకొన్నా, అది తక్కువే. తన ప్రజల పాప పరిహారార్థం అద్వితీయ జ్ఞానసంపన్నుడైన దేవుడు అనాదిలోనే క్రీస్తు పరిశుద్ధ రక్తానికి రూపకల్పన చేయడం జరిగింది. అప్పటికి ఇంకా మానవ సృష్టి జరగలేదు. భూలోకమే లేదు. భూమి మీద మనుష్యుల జాడే లేదు. పాపమే లేదు. దీన్నే క్రీస్తు కేంద్రంగా చేయబడిన దేవుని నిత్య సంకల్పంగా చెబుతారు. క్రీస్తు లేకుంటే దేవునికి సంకల్పమే లేదు అనేంత ఉన్నతం గా దీన్ని గూర్చి చెప్పుకోవడం మాత్రం అసాధారణం. తండ్రియైన యెహోవా దేవుడు తన నీతిని బట్టి సంతోషం గలవాడై ఘనపరచి గొప్ప చేసిన ఉపదేశ క్రమం సంబంధిత సంకల్పాన్ని మించిన భావజాలం లేదా భావ సంపద మరొకటి లేదంటారు.

దేవుని దృష్టి కోణంలో దేవుని మనస్సుతో దేవుని గ్రంథాన్ని లోతుగా అధ్యయనం చేసే వారికి ఒక విషయం తేటగా అర్థం అవుతుంది. అదేమిటంటే, దేవుడు అన్యాయం చేయుట అసంభవం అనునదే. ఈ సత్యాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకొన్నవారే ఆత్మ సంబంధులు. బలిని కాక కనికరమునే కోరే దేవుడు ప్రారంభంలో జంతుబలులను ఏర్పాటు చేసినా కూడా యుక్త కాలాన తన సొంత కుమారుడను బలిగా అర్పించుట ద్వారా ఇలా పాపవ్యాప్తి నివారణకు మేలైన శాశ్వత పరిష్కారం కనుగొని జంతు బలులకు చరమగీతం పలికాడు. యూదులకు చాలా సహజంగా సామాన్యంగా చెప్పే సత్యం ఒకటుంది. రక్తం చిందింపకుండా పాప క్షమాపణ కలుగదు. ఇది నమ్మే యూదులు మెస్సీయ బలిని కనులారా చూడటం ద్వారా విస్మయానికి గురయ్యారు. మహాదేవుని సంకల్పానికి బహు ముగ్ధులై ఐశ్వర్య భయంతో వినయ సంపన్నులైన వారంతా తలలు వంచి దేవుని పాదాల చెంత సాగిలపడ్డారు. మానవాళి అంతా పుట్టారు కాబట్టి చనిపోతారు. యేసుక్రీస్తు మరణించడానికే పుట్టాడంటూ పండిత పెద్దలు పదే పదే చెబుతుంటారు. ఇదే ఆయన జీవితం ప్రత్యేకత. ఇలాంటి జీవితం ఈ భూమి మీద ఏ ఒక్కరికీ లేదన్నదే సుసమాచారం. క్రీస్తు ఈ లోకానికి చెప్పశక్యం కాని ఒక వరంగాను ఆయన సాహసోపేత విధేయత తాలూకు ప్రాణత్యాగం మానవాళి పాలిట శుభవార్తగానూ చరిత్రకెక్కిందనేది గమనార్హం. బాల్యం నుండే కాక, మూడున్నర సంవత్సరాల తన యౌవన కాలమంతా దేవునికి వెచ్చించి విధేయుడైన వాడై తన్ను తాను దేవునికి అర్పణగా సమర్పించుకున్నాడు. 'నీ చిత్తమే సిద్ధించును గాక!' అంటూ మరణానికి ఎదురుగా వెళ్ళిన అరుదైన జీవితం క్రీస్తు ప్రభువుది.

లోక పాపాలను మోసుకొనిపోయే దేవుని గొర్రె పిల్లగా, పస్కా బలి పశువుగా క్రీస్తును అభివర్ణిస్తుంది పరిశుద్ధ బైబిలు. దేవునికి అవిధేయులైన మానవాళి పాపాలు గొర్రె పిల్లపై మోపబడ్డాయి. ఫలితంగా గొర్రెపిల్ల మరణించింది. క్రీస్తుకు ఇందుకొరకే శరీరం ఇవ్వబడింది లేదా అమర్చబడింది. దేవుని ప్రజల పాపాలకు ప్రతిగా వారి పక్షాన సిలువలో క్రీస్తు శరీరాన్ని శిక్షకు గురి చేయడం ద్వారా దేవుని ప్రజలు తమ తమ పాపాల నుండి విమోచించబడి పరిశుద్ధులయ్యారు. క్రీస్తు మరణం వెనుక దాగిన సువిశేష పరమార్థం ఇదే. మానవ ప్రారంభ ఆదాము అనే ఒకని అవిధేయత ద్వారా లోకంలోనికి పాపం ప్రవేశించింది. కడపటి ఆదాము అనే ఒకని విధేయత ద్వారా యావత్తూ అవిధేయ మానవాళికి రక్షణ భాగ్యం సంప్రాప్తించింది. వారంతా కొత్త జన్మతో నూతన సృష్టిగా పరివర్తన చెందారు. ఆ కడపటి ఆదామనే క్రీస్తు సాహసోపేత జీవిత విధానమే ఎల్లరకు పరిశుద్ధ జీవితాలను అనుగ్రహించింది.

ఈ దిగువ గల యెషయా భవిష్యత్ ప్రవచనం దాని వర్ణన అత్యున్నతమైన క్రీస్తు విధేయత జీవిత సారాన్ని అసాధారణ రీతిలో వెల్లడి చేయుట అనేది మనస్సు పెట్టి గమనించదగ్గది. బలియాగంలో క్రీస్తు చూపిన విధేయత ఇప్పటికీ వేనోళ్ళ కొనియాడబడుతునే ఉండుట బహు ఆశ్చర్యకరం! ఈ ప్రవచనం క్రీస్తు నందు నెరవేరింది.

''అతడు దౌర్జన్యము నొందెను
బాధింపబడినను అతడు నోరు తెరువలేదు
వధకు తేబడు గొర్రె పిల్లయు
బొచ్చు కత్తిరించు వాని యెదుట గొర్రెయు
మౌనముగా నుండునట్లు
అతడు నోరు తెరువ లేదు
అన్యాయపు తీర్పు నొందిన వాడై
అతడు కొనిపోబడెను
అతడు నా జనుల యతిక్రమమును బట్టి
మొత్తబడెను గదా''

ఈ అరుదైన సృష్టిలో, బిడ్డను నవ మాసాలు మోసిన కన్న తల్లి అతన్ని భూమి మీద విడిచి పెట్టి కన్ను మూసింది. అతడు పెద్దవాడై తన తల్లి పట్ల నిత్యమూ కృతజ్ఞతాభావం కలిగిన వాడై ఆమె ఆలోచనలు, ఆశయాలు అన్వేషిస్తూ వాటి సాధనలో నిత్యమూ నిమగ్నమవడమే కాకుండా, తన తల్లి వలె ఏ ఒక్కరూ రక్త హీనతతో చనిపోకుండా పుష్టినిస్తూ బలవృద్ధి కలుగజేసే బహు మేలైన ఉచిత సేంద్రీయ సహజాహార పంపిణీకి దృఢ సంకల్పంతో నడుం కట్టాడు. తన తల్లి మరణాన్ని ఒక పండుగగా, వేడుకగా మలిచే పనిలో సత్క్రియలయందాసక్తితో అతడు సమాజంతో ప్రేమలో పడ్డాడు. 'ఆమె మరణించి మనకు దూరం కాలేదు. ఇదిగో ఇక్కడే ఉంది నవ్వుతూ' అన్న భావనను కుటుంబంలోను, బంధు మిత్రులలోనూ ఆమె కొడుకు కలుగజేసిన వైనం అతనిదైన సృజనాత్మక కళాత్మక పనితనమనే చెప్పాలి. అది చూసి ఊరు ఊరంతా ఆ మహాతల్లి త్యాగం వూరికే పోతుందా అనే వారే అంతటా. తన మాతృమూర్తి ప్రేమను అతడు సెలబ్రేట్ చేయబూనే వైవిధ్య విధానానికి తెరలేపడం వలన అంతా మంత్రముగ్ధులయ్యేలా అది ఊరంతా పెద్ద చర్చనీయాంశంగా మారింది. అమ్మ అజెండా సాధనే ధ్యేయంగా పిల్లవాడి ప్రయాసకు అంతా జత కలిశారు.

యేసు ప్రాణ త్యాగం అచ్చు ఇలాంటిదే. సెలబ్రేట్! జీసస్ సెలబ్రేట్!

– జేతమ్

ఒకనాడు దేవుడు ఆజ్ఞాపించి చేయమన్న ఇహలోక భూ భౌతిక సంబంధ పండుగల కంటె మిన్నగా ఆత్మ సంబంధ పండుగను ఒకటి నిర్ణయించి నేడు ఉన్నతంగా ఆచరించమని తన గ్రంథం ద్వారా ఆజ్ఞాపిస్తున్నాడు. అదే క్రీస్తు పస్కా పండుగ. ఇది హృదయానందానికి సంబంధించినది. ఇది ఎక్కడా ప్రసిద్ధి చెందినట్టుగా బహు ప్రాచుర్యంలో ఉన్నట్టుగా లోకంలో కనబడదు. క్రీస్తు పస్కా పండుగ ఒకటి ఉందనేది లోకానికి తెలియదు. ఎందుకంటే ఇది ఆత్మసంబంధమైనది. దేవుని రాజ్యం దానిని పొందిన వారి అంతరంగానికి మాత్రమే అందే కార్యం. ఇది తన తోటి వారికి, పక్కవారికి, అన్యులకు ఏనాడూ అంతు చిక్కని కార్యం. ఇది జీవం గల దేవుని సంఘంలో క్రీస్తును బట్టి క్రీస్తు ద్వారా క్రీస్తునందు జరిగే ఉన్నతమైన కార్యక్రమం.


వారపు ప్రప్రథమ దినం అనే ప్రతి ఆదివారం నాడు యెడతెగక దేవుని ఆరాధనలో భాగంగా జరిగే రొట్టె విరుచుట అనేది క్రీస్తు బలియాగానికి గుర్తు. క్రీస్తు పస్కా బలి పశువుగా, వధకు సిద్ధమైన గొర్రెపిల్లగా అనాదిలోనే దేవుని చేత నిర్ణయించబడినవాడు. అది క్రీస్తు మరణంతో నెరవేరుటను నేడు మనం చూస్తున్నాం. క్రీస్తు వారి నలగగొట్టబడిన శరీరానికి గుర్తుగా రొట్టెను, మానవాళి కొరకు చిందించబడిన పవిత్ర రక్తానికి గుర్తుగా ద్రాక్షరసాన్ని... ఇలా రెండింటిని కృతజ్ఞతాపూర్వక ప్రార్థనలతో తీసుకుంటూ ప్రభువు వచ్చువరకు ఇలా చేస్తూ క్రీస్తు సిలువ యాగాన్ని గుర్తుకు తెచ్చుకుంటుంది క్రీస్తు ప్రభువు వారి సంఘం. నిజానికి ఇది భోజనం, పానం కాదు. నీతి, సమాధానం, పరిశుద్ధాత్మ సంబంధిత ఆత్మానందం ఇహమందు కాక ఈ లోక సంబంధులుగా కాక పరలోక సంబంధులుగా సంఘమనే దేవుని రాజ్యంలో జరుపుకొనే పండుగ. సంఘ భవనంలోనే ఇది జరిగినా కూడ సత్య లేఖనాల సారం ప్రకారంగా ఇది ఇహమందు అద్వితీయ సత్యదేవుడు, ఆయన నియమించిన రాజు ప్రధాన యాజకుడైన క్రీస్తు వారి సమక్షంలో జరిగే అత్యున్నత సంఘ కార్యక్రమం. సంఘం అంటే పరిశుద్ధులుగా ఉండుటకు పిలువబడిన వారని అర్థం. ఇట్టి ఆదివారపు దేవుని ఆరాధనతో సంఘం పరిశుద్ధంగా, ఆత్మ సంబంధంగా అన్నింటా బలపడుతూ ఉంటుంది.



● ముత్తు నందిని ప్యాలెస్

ఇష్టాల ఇల్లు

రాజ్ చందర్ పద్మనాభన్, నాగ జయలక్ష్మి దంపతులు తమిళనాడు రాష్ట్రం, కన్యాకుమారిలో నివసించేవారు. సొంత ఇంటి కలను నెరవేర్చుకునే క్రమంలో వీరు అనుసరించిన విధానం ఇప్పుడు దేశమంతటినీ ఆకర్షిస్తోంది. పర్యావరణ ప్రేమికులనైతే మరీ ఎక్కువగా ఆకట్టుకుంటోంది. రెండేళ్ల కిందట గృహప్రవేశం చేసుకున్న కొత్త ఇల్లది. అయితే ఆ ఇంట్లో అడుగుపెడితే కాలం గిర్రున సినిమా రీల్‌లాగ వందేళ్ల వెనక్కి తిరిగిపోయిందా అనిపిస్తుంది. ఇంటిని చూడడానికి వచ్చిన వాళ్లను అతిథి మర్యాదలతో ముంచెత్తుతారు ఈ దంపతులు. సేంద్రియ పద్ధతిలో పండించిన దినుసులు, కాయగూరలతో సంప్రదాయ తమిళ, చెట్టినాడు వంటలను వడ్డిస్తారు.



పర్యావరణహిత భవనం ముత్తు నందిని ప్యాలెస్



నాగ జయలక్ష్మి, రాజ్ చందర్ పద్మనాభన్





ఎర్రమట్టి, సున్నపు రాయితో నిర్మించిన ఇంట్లో భూగర్భ జలాలను పరిరక్షించే ఏర్పాటు ఉంది. బంకమట్టి నిర్మాణం కావడంతో ఎండాకాలం చల్లగా ఉంటుంది. నేచర్ ఫ్రెండ్లీ ట్రావెల్‌ను ఇష్టపడే వాళ్లు ఇక్కడ బస చేస్తుంటారు. బస చేయకపోయినా చూసి పోవడానికి వచ్చేవాళ్లు కూడా ఎక్కువగానే ఉంటారు. ఈ కాలంలో ఇంటిని ఇలా ఎందుకు కట్టుకున్నారనే ప్రశ్న దాదాపుగా ప్రతి ఒక్కరి నుంచి ఎదురవుతుంటుంది. జయలక్ష్మి ప్రతి ఒక్కరికీ పూసగుచ్చినట్లు వివరిస్తుంటుంది.

బాల్యంలోకి వెళ్లారాయన!

''రాజ్‌చందర్ వృత్తిరీత్యా జియో డాటా అనలిస్ట్. ఆయనకు ఇష్టమైన రోజులంటే చిన్నప్పుడు వాళ్ల అమ్మమ్మ గారింట్లో గడిపిన బాల్యమే. పైగా రాజ్ అభిరుచి, విధి నిర్వహణ కూడా పర్యావరణవేత్తలతో కలిసి పని చేయడమే. ఈ రెండు ఇష్టాలను కలుపుతూ చక్కటి ఇల్లు కట్టుకోవాలని ఎప్పుడూ చెప్పేవారు. నాక్కూడా మా సంప్రదాయ నిర్మాణంలో ఉండే సౌందర్యం చాలా ఇష్టం. ఇద్దరి అభిరుచులూ కలవడంతో ఇంటిని ఇలా కట్టుకున్నాం. మా ఇద్దరి ఇష్టాల మేరకు ఎలా కట్టుకోవాలో ఒక ఐడియా వచ్చేసింది. ఎక్కడ కట్టాలనే విషయంలో ఒక అభిప్రాయానికి రావడం కొంచెం కష్టమే అయింది. లొకేషన్ సెర్చింగ్ మొదలు పెట్టాం.

సంజీవని శకలం

కన్యాకుమారికి సమీపంలో పోథయాడి గ్రామాన్ని చూసినప్పుడు కొండలు, పచ్చటి చెట్లతో ప్రదేశం బాగుందనిపించింది. ఆశ్చర్యంగా మరో విషయం తెలిసింది. అదేంటంటే... రామాయణంలో లక్ష్మణుడు మూర్ఛపోయినప్పుడు వైద్యం కోసం హనుమంతుడు ఏకంగా సంజీవని మొక్క ఉన్న పర్వతం అంతటినీ ఎత్తుకొచ్చాడని విన్నాం. వైద్యం చేసిన తర్వాత ఆ పర్వతాన్ని తిరిగి తీసుకెళ్లే క్రమంలో పర్వతంలోని ఒక శకలం విరిగి కింద పడి పోయిందని, ఆ శకలమే ఈ కొండ అని చెప్పారు స్థానికులు. వాళ్ల విశ్వాసాన్ని పక్కన పెడితే ఆ కొండమీద చుట్టుపక్కల ఉన్న మొక్కలన్నీ ఔషధ మొక్కలే. ప్రకృతితో మమేకమై నివసించడానికి మాకు ఇంతకంటే సౌకర్యవంతమైన ప్రదేశం మరొకటి ఉండదేమో అనిపించింది. అంతే... 2021లో నిర్మాణం మొదలు పెట్టాం. ఒక ఏడాదిలో తమిళ, వేనాడు, చెట్టినాడు సంస్కృతుల సమ్మేళనమైన మా ఇంటి నిర్మాణం పూర్తయింది. సంప్రదాయ కళాకృతుల సేకరణ నా హాబీ. ఇంటిని తమిళ సంప్రదాయ సంస్కృతికి ప్రతీకగా మలిచాను. ఇంటి ముఖద్వారం నుంచి నేల, గోడ, మెట్లు, పై కప్పు, అలంకరణ వస్తువులు ప్రతి ఒక్కటీ తమ వైభవాన్ని తామే చెప్పుకుంటాయి. పర్యావరణ హితమైన సున్నపు పొడి ఇటుకలు, ఎర్ర మట్టి, ఆవుపేడ, ధాన్యం పొట్టు, కోడిగుడ్లు, బెల్లంతోపాటు అత్తంగుడి నది తీరాన దొరికే ఇసుకతో తయారు చేసే అత్తంగుడి టైల్స్‌ను వాడాం. పై కప్పుకి కాంక్రీట్ వాడకాన్ని తగ్గించి ఫిల్లర్ స్లాబ్ టెక్నిక్ ఉపయోగించాం. వర్షపు నీటిని నిల్వ చేయడానికి రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్, కరెంటుకోసం సోలార్ ప్యానెల్స్ పెట్టాం. ఈ మట్టి సౌధంలో 5 బెడ్ రూమ్‌లు, మూడు బాల్కనీలు, మూడు లివింగ్ స్పేస్‌లు ఉన్నాయి. ఇప్పటి వరకు రెండు వందల మందికి పైగా పర్యాటకులు ఈ హోమ్ స్టేలో బస చేశారు. ఆహారం కూడా తమిళనాట ప్రాంతాల వారీగా విలసిల్లిన విభిన్నమైన రుచులుంటాయి. ఇంటి ఆవరణలో అన్ని రకాల కూరగాయలనూ పండిస్తాం. వంటగదిలో వచ్చే వ్యర్థాలనే ఎరువుగా వేస్తాం'' అని తమ పర్యావరణ హిత భవనం ముత్తు నందిని ప్యాలెస్ గురించి వివరించింది జయలక్ష్మి.

పరివర్తన

ఇప్పుడవి రాళ్లు విసిరే చేతులు కాదు

ఆ అమ్మాయి ఒకప్పుడు గుంపులో రాళ్లు విసిరే కశ్మీరీ అమ్మాయి. ఇప్పుడు జమ్ము-కశ్మీర్‌లో కేవలం బాలికల కోసం ఫుట్‌బాల్ అకాడెమీ నడుపుతున్న ప్రొఫెషనల్ ఫుట్‌బాల్ ప్లేయర్. ఆమెలో వచ్చిన మార్పు ఆమెను ప్రధాని నరేంద్ర మోదీ చేత కూడా మాట్లాడించేలా చేసింది. విరాట్ కోహ్లీ కూడా ఆమెను మెచ్చుకున్నాడు. యువతకు సరైన దిశ ఉంటే వారు గెలిచి తీరుతారనడానికి అఫ్షాన్ ఆషిక్ ఒక ఉదాహరణ.

కొన్నేళ్లు వెనక్కు వెళితే 2017 డిసెంబర్‌లో ఒక ఫోటో వైరల్ అయ్యింది. ఒకమ్మాయి... ముఖానికి దుపట్టా కట్టుకుని జమ్ము కశ్మీర్ పోలీసులపైకి రాళ్లు విసురుతున్న ఫొటో అది. ఆ అమ్మాయి పేరు అఫ్షాన్ ఆషిక్. ముఖం కనబడకుండా గుడ్డ కట్టుకోవడంతో తనను ఎవరూ గుర్తుపట్టరని అఫ్షాన్ భావించింది. కానీ తర్వాత ఆమె గురించి అందరికీ తెలిసిపోయింది. సమాజం ఆమెపై 'స్టోన్ పెల్టర్' ముద్ర వేసింది. అప్పటికే ఆ అమ్మాయి ఫుట్‌బాల్ ఆటలో ప్రతిభ కనపరుస్తూ ఉంది. కాని ఈ ఫోటోతో ఆమె తన ఆటకే దూరమయ్యే స్థితి వచ్చింది.

'ఆ రోజు నేను పోలీసుల మీద రాళ్లు రువ్వాను. అది కోపంలో చేసిన పని. దానికి కారణం పోలీసులు అకారణంగా మమ్మల్ని వేధించారు. విద్యార్థులను విచక్షణారహితంగా కొట్టారు. ఇలాంటి పరిస్థితుల్లో మమ్మల్ని మేము కాపాడుకోవడానికి రాళ్లు విసరడం మినహా మాకు గత్యంతరం లేదు. నేనేమి ప్రొఫెషనల్ స్టోన్ పెల్టర్‌ను కాదు. కాని నా మీద ముద్ర పడింది. దాని నుంచి బయటపడాలంటే నేను నా చదువు మీద నా ఫుట్‌బాల్ ఆట మీద దృష్టి పెట్టి విజయం సాధించాలని అనుకున్నాను' అంది అఫ్షాన్ ఆషిక్.

ఈ ఘటన తర్వాత ఆ అమ్మాయి నెల రోజులు ఇంటికే పరిమితమైంది. అఫ్షాన్ తండ్రి ఆమెను ఇంటి నుంచి బయటకు వెళ్లనీయలేదు. అరగంటపాటు ఆడుకుని వచ్చేస్తానని తల్లికి మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకపోయింది. 'ఒకరోజు చాలా ఏడుస్తుంటే నన్ను చూసిన నాన్న ఎందుకు ఏడుస్తున్నావని అడిగారు. ఇంట్లో కూర్చుని ఏం చేయాలని ప్రశ్నించాను. ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు అనుమతించడంతో మళ్లీ ఆట మొదలుపెట్టాను' అందామె.

ముంబై వెళ్లి

కశ్మీర్ యువత తమ చదువు, క్రీడల పట్ల దృష్టి పెట్టాలని భావించిన ప్రభుత్వం అఫ్షాన్‌ను తగిన ప్రోత్సాహం అందించింది. జమ్మూ కశ్మీర్ క్రీడాశాఖ చేయూతతో అఫ్షాన్ ముంబై వెళ్లి ఆటలో శిక్షణ తీసుకుంది. ఆ తర్వాత జమ్ము కశ్మీర్ నుంచి తొలి ప్రొఫెషనల్ ఫిమేల్ ఫుట్‌బాల్ ప్లేయర్ అయ్యింది. 'నువ్వు ఆడపిల్లవి. ఫుట్‌బాల్ నేర్చుకుని ఏం చేస్తావ్ అని అందరూ అడిగేవారు. నేను ఆడే సమయానికి ఆడపిల్లలు ఎవరూ మా ప్రాంతం నుంచి ఫుట్‌బాల్‌లోకి రాలేదు. కాని నేను ఆగలేదు. పట్టుదలగా ముందు కెళ్లాను. ఇండియన్ విమెన్స్ లీగ్‌లో ఆడాను. గోల్ కీపర్‌గా విశేష ప్రతిభ కనపరిచాను. ఆ సమయంలో విదేశీ మహిళా ఫుట్‌బాల్ ప్లేయర్లని గమనించాను. వాళ్లకు చాలా మంచిశిక్షణ ఆ దేశాల్లో లభిస్తోంది. మా ప్రాంతం బాలికలకు కూడా లభించాలని భావించాను. అందుకే జమ్ము కశ్మీర్ బాలికల కోసం యునీక్ ఫుట్‌బాల్ అకాడెమీ స్థాపించాను' అని తెలిపింది అఫ్షాన్.



అఫ్షాన్ ఆషిక్



ఆరోజుల్లో రాళ్లు విసురుతున్న అఫ్షాన్ ఆషిక్

మరింత గుర్తింపు

నేడు జమ్ము కశ్మీర్‌లో మహిళా ఫుట్‌బాల్ పేరు చెప్తే అఫ్షాన్ పేరే అందరికీ గుర్తుకొస్తుంది. ఆమెకు అక్కడ ఒక సెలబ్రిటీ హోదా ఉంది. 'నేను నా గతాన్ని జయించాను. ఇప్పుడు నేను స్టోన్ పెల్టర్‌ని కాను. గోల్ కీపర్‌ని. ఇకపై నన్ను జనం అలాగే గుర్తు పెట్టుకుంటారు' అంటుందామె.